# పరిస్థితులు అనుకూలిస్తే....

శేషగిరి రావు

కథానిక

పరిస్థితులు ఎప్పుడూ అనుకూలంగా ఉండవు...

అవును! ఎందుకుంటాయి? మనిష్టమా?

అవి వాటిష్టమైనప్పుడేఅనుకూలంగావుంటాయి మనం కావాలని కోరుకుంటే వస్తాయా అనుకూలంగా? ఊహుఁ!...చింతకాయలు, బీరకాయలు కాదు మనిష్టమయినప్పుడు కోసుకోవటాన్కి... వాటిష్టం...పూర్వీకులు అంటూంటారే "ముఖాన మూడుగీతల్లో రాశాడు బ్రహ్మదేముడు" అని! అల్లాగే బ్రహ్మ ఎల్లా రాశాడో ఆ మాదిరిగా మారుతుంటాయవి ... పూర్వీకులంటే ఏ రెండో శతాబ్దంవాళ్లో కాదు...మీ అమ్మమ్మనీ, బామ్మనీ కదిలించండి తెలుస్తుంది.

అవి అనుకూలంగా ఉన్నప్పుడు మనం పట్టింది బంగారం ముట్టింది ముత్యం అన్నమాటే!...అవి ప్రతికూలంగాఉన్నాయా ఇకచచ్చామే వచ్చే ఉద్యోగం ఫైసల్... ఆయేడు పరీక్షల్లో ఫ్లో...యింకా...యింకా...

"ఒరే అబ్బాయ్!! పరిస్థితుల్ని నిందించుకుంటూ కూర్చుంటే లాభం లేదురా బాబూ! పురుష ప్రయత్నంకూడా ఉండాలి...!" అని నాబోటి వాడెవరైనా అంటే ఖస్సుమంటాడు శివరాం. అందరి దగ్గరా పైతాలూకు భారతం విప్పి వాళ్ళ భరతం పట్టాడు.

అతనలా మూఢంగా వాదిస్తాడంటే మరి వాదించడూ...ఏ వాడచిలుక ఆవాడ పలుకులు పలుకుంది... త్రికరణ శుద్ధిగా ఛాందసుడైన తాతగారి దగ్గర పెరిగివాడాయె...చిన్నపట్నుంచీ అతను నూరిపోసిన విద్యేగా! ముద్దుల మొదటి మనవఁడిని వదలి ఉండలేక శివరామయ్యగారి తన్ని పెంచాడు. శివరాంకి శాస్త్రాలన్నా; జ్యోతిష్కమన్నా మూఢనమ్మకం. ఎవరో మీ తాతపేరూ నీ పేరూ దాదాపు ఒకటే అది అల్లా ఉంటే అరిష్టం...శాంతి చెయ్యాలి అన్నారట. వెంటనే ఆ 'శాంతి' చేసేదాకా అన్నంముట్టకుండా మారాంచేశాట్ట శివరాం అశాంతితో...

ఇప్పుడూ అదే జరిగింది. ఇంతకీ వచ్చిన తంటా అంతా ఎవడో ఒక అడ్డపెట్టెల పిలకయ్యచెప్పాట్ట అర్థణా ముక్కుపొడుం అమాతంగాపీల్చి మన వాడికి జ్యోతిష్కం. అతగాడు యితగాడి చెయ్యి జూచి 'వచ్చేనెల పదిహేనవ తేదీదాకా నీకు పరిస్థితులు ప్రతికూలం...' అని. 'ఆ తర్వాత?' అని యితను ఆత్రుతగా ప్రశ్నించేసరికి "ఓహో! యీాయన మనబుట్టలో పడ్డాడు బాగారాల్చచ్చు" అనుకొని మరికొంత పొడుంలాగి బాగా అనుకూలంగాచెప్పి పావలా రాబట్టాడు ఆ పిలకయ్య.

"ఇంతకీ మనరోజులు బాగులేవు కాబట్టి నాకింకా ఉద్యోగం రాలేదు. ఇంతచదువూ చదివి మామూలు గుమాస్తా ఉద్యోగం చెయ్యటం నా కిష్టంలేదు. వస్తే ఏకంగా పెద్ద ఉద్యోగమే రావాలి. గొప్పగొప్ప జ్యోతిష్కులు చెప్పారునాకు వచ్చేనెల పదిహేనవ తేదీనుండి రోజులు బావుంటాయని మంచిధనలాభం ఉంటుందని...గొప్ప ఉద్యోగం దొరుకుతుందని! ... కాబట్టి ఇప్పుడీ గుమాస్తా ఉద్యోగం తృణీకరిస్తున్నాను. ఈ కాసిన్ని రోజులూ ఓపిక పట్టండి అదేవస్తుంది వెధవ ఉద్యోగం. 'నిదానం ప్రధానం!' అన్నారు పెద్దలు. పెద్దలు ఏమాటా ఊరికే అనరు. ఒక్కనెలేనండి నాన్నగారూ" అంటూ సణగటం మొదలెట్టాడు శివరాం. ఇంతకీ అతను ఎం. ఏ. ప్యాసవటమే వచ్చినచిక్కు. అంతచదివీ మరీ ఛాందసంగా ప్రవర్తిస్తాడంటే ఆశ్చర్యంగా లేదూ? అవును ఆ తాతగారు వేసిన బీజం అల్లాంటిది. "అబ్బాయి నీకు మూఢనమ్మకాలూ పెద్దలందు గౌరవం ఉండటం మంచిదే. కాని అతిగా ఉండకూడదు. ఈ రోజుల్లో ఉద్యోగాలు దొరక్క ఎంతమంది ఛస్తున్నారో తెలుసుగా! యింకెవరికన్నాయిప్పిస్తే బంగారంగా చేస్తారు దీన్ని. పెద్దవాడిని నామాట తోసెయ్యకు" వెంకటరావుగాదు శతవిధాల ప్రయత్నించారతన్ని ఒప్పించటానికి. ససేమిరా అన్నాడు.

చిన్నపిల్లవాడినైతే కొట్టి చెప్పొచ్చు. ఇరవై ఏళ్లు పైబడ్డవాడి నేమనగలడు? అతగాడికుండాలి గానీ...

"అబ్బాయ్! నామాట విను. ఉదాహరణకు నన్నుచూడు చిన్న గుమాస్తాగాచేరి తర్వాత క్రమేణా మేనేజరునయ్యా. అంతేగానీ నిల్చున్న పళంగా ఎల్లాపడుకుంటావు. ఏదోఒకపోస్టు కష్టయి చేసి అది వస్తుందని ఎదురుచూచేకంటే ఇందులో చేరటమే మంచిదని నా ఉద్దేశ్యం. అనుభవంతో చెబుతున్నా తర్వాత నీయిష్టం." తన అనుభవాన్ని పునస్కరించుకుని అన్నారు వెంకట్రావుగారు. శివరాంమాత్రం ఉలుకూ పలుకూ లేకుండా శివలింగంలాగ కూర్చుండి పోయాడు. ఆయనకీ విసుగేసి ఆఫీస్‌టైమ్ అవటంవల్ల డ్రైవరు పిలుపుతో నిష్క్రమించారు.

నక్షత్రకుడిలా తగులుకున్న భక్తుడు పోవటంతో శివలింగం సజీవమైంది. చేతులు దులుపుకొని ఆయన పోయినవైపు చూస్తూ ఒక ముక్కుముక్కి మేడె దెక్కబోయాడు శివరాం.

"ఏమిట్రా ఆయన నేదీ?"అని కమలమ్మగారు రంగంలోకి ప్రవేశించటంతో మళ్ళీ వెనక్కొచ్చి బోనులో నిలబడ్డ డిఫెండెంటులా సంజాయిషీ చెప్పుకోక తప్పిందిగాదు.

"అదిగాదే అమ్మా! మొన్న ఒక ఉద్యోగానికి దరఖాస్తుపెట్టా...అది వస్తుంది దాన్లో నే చేరతాను అన్నా...నిన్న నాన్నగారి స్నేహితుడు చెప్పాడో గుమాస్తా ఉద్యోగం ఖాళీ అయివుంది, మీవాడిని చేరితేచేరమను అని...ఏకంగా ఆ పెద్ద ఉద్యోగంలోనే చేరుతాను అని నేను. ఈ గుమాస్తా ఉద్యోగంలో చేరమని నాన్న. నీవే చెప్పవే!" అంటూ చెప్పసాగాడు శివరాం తల్లి దగ్గరున్న చనువుమీద.

"అయితే తెలీకడుగుతాగానీ, చేరితే ఆ పెద్ద ఉద్యోగంలో చేరకూడదూ?" కమలమ్మ అడిగింది అమాయకంగా.

"చేరవచ్చుగానీ, ఈ ఉద్యోగంలో చేరితే అబ్బ! బండచాకిరీచెయ్యాలి. జ్యోతిష్కులుకూడా చెప్పారు, నాకీ నెల దాటితే ఉద్యోగ లాభ ముందని."

"కావచ్చు! ముందు దీన్లో చేరరాదూ, నీదేం బోయింది. ఆ వచ్చేది కొద్దిజీతమైనా నీ ఖర్చుకైనా సరిపోతుంది. ఆ పెద్దఉద్యోగమొస్తే సరే సరి. లేకుంటే దీన్లోనైనా పైమోషనొస్తుందేమో! మీ నాన్నగారికంతేగా..."అంటూ సాగదీసింది కమలమ్మ.

"అబ్బ, నీకు తెలీదు పోవే!"అంటూ టెన్నిస్ రాకెట్‌తో బయటపడ్డాడు శివరాం.

వెంకట్రావుగారు ఒకానొక కంపెనీలో మేనేజరు. నెలతిరిగేసరికి కనీసం ఏడెనిమిది వచ్చుకాగితాలైనా కోటు లోపలిజేబులో చేరుతుంటాయి. అయినా యంతచెట్టుకంత గాలి అన్నట్లు వచ్చింది వచ్చినదారినే పోతుంది.

ఇద్దరు ఆడపిల్లలు,ముగ్గురు మగపిల్లలు సంతానం. శివరాం పెద్దవాడు. తర్వాత యిద్దరూ, ఒకడు ఫిఫ్తుఫారం, మరొకడు సెకండ్‌ఫారం చదువుతున్నారు. ఇంకా ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యలేదు. ఎక్కడైనా కదిలిస్తే ఇరవైవేలూ, ముప్పైవేలూ...అదేమంటే "నీకేమయ్యా, నెల తిరిగేసరికి వెయ్యి రూపాయలన్నా చూస్తావు!" అంటారు. ఇదుగో పులంటే, అదుగో తోక అనే రకం! ఏదో కాస్త చెయ్యిజాపుతా డనుకోండి! అంతలోనే వెయ్యి రూపాయలు...మరో మాట అయినా లేకుండా.

ఎలాగో తంటాలుపడి యమ్. ఏ. దాకా చెప్పించాడు శివరాంకి. చేతికందినవాడుకదా ఏదో కాస్తసహాయంగా ఉంటాడుకదా అని ఆశించాడు వెంకట్రావు. కలెక్టర్ ఆఫీసులో గుమాస్తాపని మొహమాటంవల్ల తన స్నేహితుడు యిప్పిస్తానని చెప్పాడు. చేరమంటే ఎప్పుడో ఏదో ఒరుగుతుందని ఇప్పుడు చేరనని మొండివెయ్యటం మొదలు పెట్టాడు శివరాం. చెప్పీచెప్పీ విసుగెత్తి మళ్ళీ ఆ విషయాన్ని కదపదల్చుకోలేదు వెంకట్రావు.

ఇక పెళ్ళికెదిగినవాడున్నాడంటే బేరాలు రావటం ఒక వింతగాదు ఈ రోజుల్లో పది... పదిహేను,... దాకా సాగుతున్నాయి బేరాలు. పోనీ ఆ పెళ్ళి అయిందనిపిస్తే ఆ కట్నంతో మొదటిదాని పెళ్లి అయిపోతుంది... పైగా ఒక బరువు మీద పడితేనైనా ఉద్యోగంలో చేరుతాడేమోనని ఆశించారా దంపతులు.శివరాం దానికి సిమెంట్

కాంక్రీట్ అనకట్టేశాడు. "ఉద్యోగం దొరికేదాకా పెళ్ళి చేసుకోన"ని మొదలెట్టాడు.

వాళ్ళనాన్న దగ్గరమాత్రం సరేనని చెప్పి పిల్లను చూసి వస్తుంటాడు. అల్లాగైనా నాలుగూళ్ళూ తిర గొచ్చని అతని ఆశ!

చూచివచ్చాక పిల్ల పొట్టనో, సీమబొగ్గును మించిందనో, జాంబవతనో, మండోదరనో, పల్లెటూరు గమారనో, గరుత్మంతుడి చెల్లెలనో, గానగార్దభి అనో—ఏదో ఒక పేరుపెట్టి వర్ణించి వర్ణించి విరగబడి నవ్వుతాడు.

బలవంతాన కూర్చోబెట్టి పెళ్ళిచేయడానికి పసిపిల్లవాడు గాడు. మరేం చేయగలడు వెంకట్రావు. శివరాం ఇరవైఏళ్ళ వయస్కుడవటమూ ఎం. ఏ. సెకండ్ క్లాస్‌లో ప్యాసవటమూవచ్చింది: అన్నిటికీ తిప్పలు. "వెధవా కట్టు తాళిబొట్టు!" అని ఎలా అనగలడు చెప్పండి?

వ్యక్తుడై కూడా తండ్రిబాధను గుర్తించకుండా మసలుకోవటం శివరాందే తప్పు.

"పెళ్ళయ్యాక భార్యకు పూలు తేవటానిక్కూడా! "నాన్నా! అణా...!" "నాన్నా...! కాణీ...!" అని అడగాలి. అంతకంటే అవమానం ఉందా—అంటాడు శివరాం; నిజమే! "అదికాదని ఎవరనగలరు? తల్లితోగూడా అన్నాడామాట. అనేకసార్లు, జంకుతూ జంకుతూ భర్తచెవినేసిందా మాట కమలమ్మ... ఆవిడనుకున్నట్లే పిడుగులవర్షం కురిసింది

"ఏడిశాడు! ఏదో ఒక వంకచెప్పటం తప్ప మరేముంది. ఇన్నాళ్ళూ పీక్కుతినలేదా.ఇప్పుడు పీక్కుతినటంలేదా? అవమానమట అవమానం..."

ఆఖరు కోనాడు వెంకట్రావుగారు బ్రహ్మాస్త్రం విసిరాడు శివరాం మీదికి ..."అటుపెళ్ళయినా చేసుకోమనులేకుంటే గుమాస్తా ఉద్యోగంలోనైనా చేరమను!" అని.

శివరాం యిరుకులో పడ్డాడు. అడకతెరలో పోకచెక్కలా అయిందాతనిపని...

చిన్నతనంనుంచీ తాతగారి దగ్గరే పెరగటంతో తండ్రిదగ్గరంత చనువులేదాతనికి. ఆయనేమీ అనక పోయినా భయపడుతూనే ఉంటాడు. ఇప్పుడా యన చేసిన శాసనాన్ని ధిక్కరించటానికతనికి ధైర్యం చాలలేదు! ఎల్లాఐనా తల్లిచేత రెకమెండ్ చేయించుకుని ఈ యిరుకులోనుంచి బయట పడాలని అతనుద్దేశ్యం ... "పరిస్థితులు అనుకూలంగా లేనందువల్లే ఈ తంటాలంతా—"అంటాడెవరైనా అడిగితే, ఈ గాలివాన వెలిసేదాకా ముఖం తప్పిద్దామని తాతగారూరికి వెళ్ళటానిక్కు బయలు దేరాడోరోజు!...ఏదో ఒకటి తేల్చందే వెళ్ళటానిక్కు వీల్లేదని తండ్రి అనటంతో ఆ ప్రయత్నం కూడా తల్లక్రిందులైంది.

ఈ దెబ్బతో పిల్లల్లోకూడా దుమారం రేగింది. 'అన్నయ్య పెళ్ళికొప్పుకుంటాడు!' అని పెద్దవాడంటే 'కాదు! గుమాస్తాగా చేరతాడు' అని చిన్నవాడన్నాడు. ఇద్దరూ జుట్లుపట్టుకునేంతదాకా కూడా తయారయ్యారు. ఒకటి రెండుసార్లు చిన్నవాడి వీపు విమానంమోత మోగింది. చిన్నవాడూ మరేం తక్కువ తినలేదుగా. వెనగ్గుండా బోయి పెద్దవాడికి చిట్టెడు మిరియాలు రాలేట్టు మందిచ్చి పరుగుచ్చుకునేవాడు. ఆఖరుకు అక్కయ్యలద్వారా వారి ద్వంద్వయుద్ధం ఒకకొసకొచ్చింది. వారి సలహా ప్రకారం వీరిద్దరూ వీరి వాదనల్ని బలబరుస్తూ పందేలు కాసేరు!

"తప్పక పెళ్ళే చేసుకుంటాడని" పెద్దవాడు తను రెండేళ్ళనుంచీ ఉండీలో వేసిపెట్టినదానిలో సగం...పధ్నాలుగణాలు పందెం కాసాడు. 'కాదు తప్పక! తప్పకన్నరతప్పక!! ఉద్యోగంలో చేరతాడు' అని ఆ యేడునుంచే అన్నయ్యను అనుకరిస్తూ తను దాచినదంతా ఎదురుపందెం కాసేడు చిన్నవాడు. చిన్నవాడవటంవల్ల తల్లిదగ్గర్నుంచి అతనికే ముడుతుండేది ఎక్కువగా. అందువల్లే రూపాయ రెండణాల ఒకకానీ అయింది కరెంట్ అకౌంటు.

మధ్యవర్తిగా పెద్దక్కయ్య నిలబడ్డది. చిన్నావిడమీద ఇద్దరికీ నమ్మకంలేదు. ఇద్దరూ బోల్తా పడ్డారోసారి. ఇల్లాగే పరీక్ష ప్యాసవటంలో తగాదాపడిచెరో పావలాపందెంకాసి చిన్నావిడకిస్తే ఆవిడ రిబ్బన్లు కొని చక్కగా దాచుకుంది. అందువల్ల ఈ మాటు పెద్దావిడే మధ్యవర్తి అయి కూర్చుంది. చిన్నామెకు గుర్రుపుట్టి ఈ విషయం యథావత్తూ తండ్రిచెవినేసింది. ఆయన విరగబడి నవ్వారు.

ప్రపంచం తల్లక్రిందులైనా...తూర్పున ఉదయించే సూర్యుడు పొరపాటుగాగానీ...భూమి తిరిగేవైపు మారటంవల్లగానీ పడమట ఉదయించినా గుమాస్తాపని జన్మలో చేయ దల్చుకో లేదు శివరాం. కాని ఎటొచ్చీ ఈ జన్మలో పెళ్ళి తప్పనిసరి! ఎప్పుడో ఒకప్పుడు చేసుకునేదేగా? తనూ చాలా రోజులు ఆత్రుతపడ్డాడుకూడా తన పెళ్ళిని గురించి పెళ్ళయిన మిత్రులను చూచి.... పిచ్చిపిచ్చి ఊహల్తో ఒక్కోరాత్రి నిద్రకూడా పట్టేదికాదు. తను అనేవాడు "ఏ వయస్సులో అనుభవించాల్సింది ఆ వయస్సులోనే. తర్వాత అంత మాధుర్యం ఉండదు" అని. ప్రతిదినం బీచ్ కెళ్ళినప్పుడు అక్కడి జంటలనుచూచి ఈర్ష్య పడ్డరోజులుకూడా లేకపోలేదు. ఆ తర్వాత బీచ్ కెళ్ళడమే మానుకున్నాడు. నేనూ ఎప్పుడల్లా వస్తానా అని దిగులుపడేవాడు కూడా.

ఎటొచ్చీ పెళ్ళికొప్పుకోవటమే శ్రేయస్కరం. రెండురోజుల అంతర్యుద్ధం ఇలా పరిణమించింది. కమలమ్మ తనకూ ఒక కోడలు వస్తోంది అని సంతోషించింది. చిన్నవాడు డబ్బుపోయినందుకాదు గానీ, అన్నం మానుకున్నాడు. 'ఎవరు గెల్చారురా' అన్న నాన్న మాటలకు యింత ముఖంచేసుకుని దిండులో ముఖందాచుకున్నాడు చిన్నకుంక!

ఇన్నాళ్లూ ఎగబడే సంబంధాలు తగ్గిపోయాయి. పిల్ల ఎంత బాగున్నా కోతి, కొండముచ్చు అని వంకలు పెడితే వాళ్ళకుమాత్రం ఎలావుంటుంది... 'ఈయ నేగాబోలు మహా అందగాడు!' అనుకోరూ.

శివరాం ఒప్పుకున్న విషయం నాలుగుచోట్లా మాటలసందర్భంలో వదిలాడు వెంకట్రావు. అది అలాఅలా ప్రాకి అయిదురోజుల్లో ఒక సంబంధాన్ని గుమ్మానికి చేర్చింది. కొడుకును పంపితే ఏదో ఒక వంకబెట్టి పడగొడతాడనేమో, వెంకట్రావుగారే చుట్టపుచూపుగా వెళ్ళి పిల్లను చూసి వచ్చాడు. కాస్త నసిగినా తర్వాత సర్దుకున్నాడు శివరాం మరి గత్యంతరం లేక...

పెళ్ళి జరిగిపోయింది.

కాలెండర్‌లో ఒక కాగితం చిరిగింది. శివరాం అనుకున్నదానికంటె పదిహేను రోజులు ఎక్కువయ్యాయి. అతని పరిస్థితులలో మార్పేమీ లేదు.

"బహుశా జ్యోతిష్కులేమైనా లెక్క తప్పేశారేమో. అయినా నా తొందరగానీ చెడు రోజులు పోగానే వచ్చి పడిపోతాయా మంచి రోజులు? కాస్త ఆ గాలి జోరుతగ్గాక ఈ గాలి ప్రవేశిస్తుంది. రాత్రి గడిచాక ఒక్కుమ్మడిగా వెలుగువస్తుందీ? కాస్త కనబడేంత వెలుగు తర్వాత మసగ చీకటి. తర్వాత మరికొంత వెలుగు. తర్వాత తెల్లవారుతుంది; అలానే అన్నీను" ఎన్నో ఆలోచనలతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు శివరాం.

ఆ రోజు ఉత్సాహంతో బజారుకెళ్ళినశివరాం నల్లబడ్డ ముఖంతో తిరిగి వచ్చాడు. సంగతేమిట్రా అని వేధిస్తే బయట పెట్టాడు అసలు విషయం. తను అప్లయిచేసిన ఉద్యోగానికి తనతో అప్లయి చేసిన రామారావుకు అయిదురోజుల క్రితమే ఇన్‌టర్వ్యూకార్డు వచ్చిందట. ఫస్టుక్లాసువాళ్ళనే తీసుకున్నారట. ఆ ఆశకూడా పోయింది.

ఈ విషయం వినటంతో వెంకట్రావుగారు తారాపథాన్నందుకున్నాడు.

"చేస్తేవిన్నావ్...ఇప్పుడు అఘోరించు!... ఇప్పటికైనా ఆ హెడ్ గుమస్తాపనికి చూడు... నాకు నమ్మకంలా యింకా వుంటుందని." విధిలేక నా ముఖాన అదే రాసివుంది అనుకుంటూ పోయాడు కలెక్టరాఫీసుకు శివరాం గేటుదగ్గరే పని పూర్తయింది. ప్యూనే చెప్పేశాడు అదెప్పుడో ఫిలప్ అయిందని పైగా అతనికి ప్రమోషన్‌కూడా వచ్చిందట.

"దాన్లోనైనా చేరిఉంటే బావుణ్ణు" అని గొణుక్కుంటూ యింటిముఖం పట్టాడు.

ఒకసారి అడిగితే యిప్పుడు "ఐ. ఏ. ఎస్. చదువుతున్నానోయ్!" అన్నాడు.

ఇప్పుడు పైపెచ్చు అతనిభార్య కాపురానికొచ్చిందట. మొన్ననే నన్నుగూడా అడిగాడు. "మీ ఆఫీసులో ఏవైనా వేకెన్సీలున్నాయా?" అని.

"ఐ. ఏ. ఎస్. కు చదువుతున్నానంటివి గదోయ్"...అయినా యం. ఏ. చదివి వెధవ గుమాస్తా ఉద్యోగాలెందుకురా?" అన్నా కాస్త ఏడిపిద్దామని.

"పరిస్థితులు అనుకూలంగా లేవురా..." అని ముఖం చిట్లించి చేత్తో నెత్తికొట్టుకున్నాడు ఆశలన్నీ అంతరించిన శివరాం. ★